# సృజనవాణి స్వచ్ఛంద సంస్థ
# తెలుగు భాషాదినోత్సవ వేడుకలు – 2014

**పరిచయం :** సృజనవాణి స్వచ్ఛంద సంస్థ "వ్యక్తి వికాసమే సమాజ వికాసం " అనే సిద్ధాంతంతో గత 18 సంవత్సరాలుగా విద్య, ఉపాధి, గ్రామీణాభివృద్ధి కార్యక్రమాలను విశాఖపట్టణం జిల్లాలో నిర్వహిస్తుంది. దేశానికి ఆధారం యువత అనే భావనతో వారికి ఉపాధి శిక్షణా కార్యక్రమాలను నిర్వహించడం, గ్రామీణ యువత సాధికారత కొరకు వ్యక్తిత్వ వికాస కార్యక్రమాలను చేపడుతోంది. దీనిలో భాగంగా "యువకిరణ్" అనే కార్యక్రమం ద్వారా చోడవరం,చీడికాడ,మాడుగుల మండలాల్లో గల డిగ్రీ చదువుతున్న పేద కుటుంబంకు చెందిన విద్యార్థులకు వారి ఆర్థిక అవసరాల కొరకు ఉపకారవేతనాలను అందిస్తున్నది. వీరితో తమ గ్రామంలో గల ప్రభుత్వ పాఠశాల యందు పిల్లలకు చదువు పట్ల ఆసక్తి కలిగించే విధంగా కొంత సమయం పాటు తెలుగు,ఆంగ్లం భాషా నైపుణ్యాలను పెంచడంలో తరగతులను నిర్వహించడం జరుగుతోంది. అంతే కాకుండా పాఠశాలల్లో వివిధ శాస్త్రీయ మరియు విద్యా పరమైన కార్యక్రమాలను సృజనవాణి చేపడుతుంది. దీనిలో భాగంగా ఆగష్టు 29 శ్రీ గిడుగు రామమూర్తి పంతులు గారి జయంతి సంధర్భంగా ఆగష్టు 27 వ తేది గురువారం విశాఖపట్టణం జిల్లా, చోడవరంలో తెలుగు భాషా దినోత్సవ వేడుకలను పిల్లలు మరియు తెలుగు ప్రజానీకం అందరితో కలసి అత్యంత ఘనంగా జరుపుకున్నాం.

**ఉద్దేశ్యం:** మారుతున్న ప్రపంచీకరణలో భాగంగా మాతృభాష తన ఉనికిని కోల్పోతుంది. మాతృభాష యొక్క ఔన్నత్యాన్ని, విశిష్టతను విద్యార్థులకు తెలియచెప్పడం. ఉగ్గుపాలతోనే ఒంటబట్టేది మాతృభాష. అటువంటి భాష కాలగమనంలో తన ప్రాధాన్యతను కోల్పోవడం ద్వారా సమాజంలో గల మాతృభాష మూలాలు దెబ్బతినే పరిస్థితి ఎదుర్కొంటుంది. అటువంటి పరిస్థితే కనుక కొనసాగితే భవిష్యత్ లో మాతృభాష కనుమరుగయ్యే ప్రమాదం ఉంది. దాని యొక్క గొప్పతనాన్ని సమాజానికి చాటి చెపుతూ పాఠశాలలో చదివే పిల్లలకు తమ మాతృభాష విశిష్టతను తెలియజేసే నేపధ్యంలో సృజనవాణి ఈ కార్యక్రమంను నిర్వహించింది.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా ఉప విద్యా శాఖాధికారి శ్రీ బి. లింగేశ్వర రెడ్డి గారు, విశిష్ట అతిథులు ఆచార్య సార్వభౌమ శ్రీ వేదుల సుబ్రహ్మణ్య శాస్త్రి (విశ్రాంత తెలుగు విభాగాధిపతి, ఆంధ్ర విశ్వ కళా పరిషత్) గారు, గౌరవ అతిథులు మాడుగుల మరియు చోడవరం మండల విద్యా శాఖాధికారులు శ్రీ బి. సత్యనారయణ మూర్తి గారు, శ్రీ ప్రసాద్ గారు విచ్చేసారు.

**కార్యక్రమ ఘట్టాలు :** మాడుగుల, చీడికాడ, చోడవరం మండలాల్లో గల ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయుల సహకారంతో ప్రతీ పాఠశాలకు 100 మంది చొప్పున మొత్తం 2100 మందికి వ్యాసరచన పోటీలను నిర్వహించి వారిలో పాఠశాలకు నలుగురు విద్యార్థులను విజేతలుగా ఎంపిక చేసి వారికి చోడవరం లో ప్రశ్నా వినోదం (క్విజ్ ) ను నిర్వహించడం జరిగింది.





ముఖ్య అతిథులు శ్రీ బి. లింగేశ్వర రెడ్డి గారు మాట్లాడుతూ నేటి సమాజంలో ప్రభుత్వ బడులు ప్రభుత్వం మరియు ప్రజలు అందిస్తున్న వసతులతో సమర్ధవంతంగా పనిచేస్తున్నాయని,వీటిని ప్రోత్సహిస్తూ సృజనవాణి ఇటువంటి కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమని చెప్పడం అందరికీ సంతోషకరం.




**విశిష్ట అతిథులు శ్రీ వేదుల సుబ్రహ్మణ్య శాస్త్రి గారు ప్రసంగిస్తూ ఈనాటి మన మాతృభాష ఎంతో గొప్ప విలువలు,సంప్రదాయాలు,కళలు గల భాషని, అటువంటి భాష గల ప్రాంతంలో మనం జన్మించడం అందరి అదృష్టం అన్నారు. దేశంలో ఎక్కువ మంది మాట్లాడే రెండవ భాష మన మాత్రుభాషేనని, మన కన్నతల్లిని ఏ విధంగా ప్రేమిస్తామో మన మాతృభాషని అంతే ఎక్కువగా ప్రేమించాలని** విన్నవించడం మనందరికీ శిరోధార్యమైన విషయం.



శ్రీ బి. సత్యనారయణ మూర్తి గారు మాతృభాష యొక్క గొప్పతనాన్ని కొనియాడుతూ ఇటువంటి కార్యక్రమాలను నిర్వహించడం ఎంతైనా అవసరమని,ఉపాధ్యాయులు మాతృభాష యొక్క విశిష్టతను విద్యార్ధులకు తెలియచేసి,వారికి దానిపై మక్కువ పెంచే కార్యక్రమాలను పాఠశాలల్లో నిర్వహించాలని కోరడం అందరికీ కొత్త ఉత్సాహం నింపింది.



**కార్యక్రమానికి విచ్చేసిన ఉపాధ్యాయులు కొందరు మాట్లాడుతూ మన మాతృభాష యొక్క గొప్పదనం గురించి ఎంత చెప్పినా తక్కువేనని, ఆనాడే విజయనగర రాజులు దేశ భాషలందు తెలుగు లెస్స అని కొనియాడారు. ఈనాడు మనం తెలుగు మాట్లాడటం పట్ల అంత సుముఖత చూపించటం లేదని,ప్రస్తుతం కొన్ని సాధారణ ఆంగ్ల పదాలకు కూడా తెలుగు పదాలు వెతుక్కునే పరిస్థితి ఏర్పడిందని, ఇదిలా కొనసాగితే రానున్న తరాలకు కొన్ని రకాల తెలుగు పదాలు కనుమరుగయ్యే ప్రమాదం ఉందని ఆవేదన వ్యక్తం చేసారు.**




సృజనవాణి సభ్యులు శ్రీ చంద్రశేఖర్ గారు మాట్లాడుతూ సృజనవాణి ఏర్పాటు క్రమమును, లక్ష్యాలను వివరించారు. అంతే కాకుండా తెలుగు భాష యొక్క గొప్పతనాన్ని చెప్పి అది ఎదుర్కొంటున్న సమస్యలను, వాటిని అధిగమించే మార్గాలను విన్నవించారు.

తదనంతరం విచ్చేసిన 20 పాఠశాలల 90 మంది విద్యార్థులకు తెలుగు సాహిత్యంపై క్విజ్ పోటీలను నిర్వహించి వారిలో ముగ్గురు విజేతలను ఎంపిక చేయడం జరిగింది.

మొదటి మూడు ఉత్తమ బహుమతులను

మాడుగుల మండలం **గొటివాడ అగ్రహారం ప్రాథమికోన్నత పాఠశాల, చీడికాడ ప్రభుత్వ ఉన్నత పాఠశాల**, మాడుగుల మండలం కింతలి **జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు** గెలుపొందాయి.







**గెలుపొందిన మూడు పాఠశాలల కు శ్రీ బి. లింగేశ్వర రెడ్డి గారు చేతుల మీదుగా బహుమతులను ప్రదానం చేయడం జరిగింది.**

**అంతే కాకుండా కార్యక్రమంలో పాల్గొన్న ప్రతీ పాఠశాల ఉపాధ్యాయులకు జ్ఞాపికలను అందజేయడం జరిగింది.**

విచ్చేసిన విశిష్ట అతిథులు శ్రీ వేదుల సుబ్రహ్మణ్య శాస్త్రి గారికి అతిథుల ఆధ్వర్యంలో సత్కరించుకోవడంతో ఈ కార్యక్రమం ముగిసింది.





## తెలుగుభాష పరిరక్షణ అందరి బాధ్యత

చోడవరం టౌన్: సాక్షి 24|7 విశాఖపట్నం

తెలుగుభాష ఔన్నత్యాన్ని ప్రతి ఒక్కరూ కాపాడాలని ఆంధ్రా యూనివర్సిటీ తెలుగు విభాగం రిటైర్డ్ ప్రొఫెసర్ వేదుల సుబ్రహ్మణ్యశాస్త్రి కోరారు. ఈనెల 29న గిడుగు వెంకటరామ్మూర్తి పంతులు జయంతి సందర్భంగా తెలుగుభాషా దినోత్సవాన్ని పురస్కరించుకొని బుధవారం స్థానిక వెంకటేశ్వర కల్యాణ మండపంలో 'వ్యక్తిత్వ వికాసమే సమాజ వికాసం' అనే అంశంపై సమావేశం నిర్వహించారు. సృజన వాణి స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో వేదుల మాట్లాడుతూ ఇంగ్లిష్ భాష కూడా మనిషికి అవసరమేనని, కానీ మాతృభాషను మరిచిపోకూడదన్నారు. తెలుగుభాష ఔన్నత్యం గురించి వివరించారు. చోడవరం, చీడికాడ, మాడుగుల మండలాల్లో విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో చోడవరం, మాడుగుల మండలాల విద్యాశాఖాధికారులు కె.వి.ఎస్.ఎల్.ప్రసాద్, సూర్యనారాయణ, స్వచ్ఛంద సంస్థ కార్యవర్గ సభ్యుడు ఎ.వి.చంద్రశేఖర్ పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న వేదుల సుబ్రహ్మణ్యశాస్త్రి



ఈనాడు విశాఖపట్నం

గురువారం 28 ఆగస్టు 2014 16 పేజీలు

## మాతృ భాషను మరవొద్దు

చోడవరం, న్యూస్‌టుడే: మాతృభాషను పరిరక్షించుకోవాల్సిన దుస్థితి మనకి రావడం శోచనీయమని ఆంధ్రా విశ్వవిద్యాలయ విశ్రాంత ఆచార్యులు వేదుల సుబ్రహ్మణ్యశాస్త్రి అన్నారు. స్థానిక వెంకటేశ్వర కల్యాణ మండపంలో సృజన వాణి స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో బుధవారం మాతృ భాషా దినోత్సవం జరిగింది. గిడుగు వెంకటరామ్మూర్తి పంతులు జన్మదినాన్ని పురస్కరించుకుని నిర్వహించిన మాతృభాష దినోత్సవానికి ముఖ్యవక్తగా ఆయన పాల్గొని భాష విశిష్టతను విద్యార్థులకు వివరించారు. ఏ ఇద్దరు పరభాషీయులు కలిసినా వారు మాతృభాషలో మాట్లాడుకుంటున్నారు. తెలుగువారు మాత్రం ఇతర భాషల మోజులో కొట్టుమిట్టాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. భాష ఉనికిని కాపాడాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. చోడవరం, మాడుగుల ప్రాంతాలకు చెందిన విద్యార్థులకు మాతృభాషపై నిర్వహించిన వ్యాసరచన పోటీలో విజేతలకు బహుమతులను అందించారు. మండల విద్యాశాఖాధికారులు ప్రసాదు(చోడవరం), సూర్యనారాయణ(మాడుగుల), ఎ.వి. చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

మాతృభాష విశిష్టతను వివరిస్తున్న సుబ్రహ్మణ్య శాస్త్రి

ఎంపికైన మూడు ఉత్తమ బహుమతులకు నాబార్డు ఎ జి ఎమ్ శ్రీ కె.వి.ఎస్.ఎస్.ఎల్.వి ప్రసాద్ రావు గారు వారి తండ్రి గారి జ్ఞాపకార్థం ఆర్థిక సహాయం అందించడం ఎంతో ఆనందదాయకం.

**ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేసిన అతిథులకు, విద్యార్థులకు, ఉపాధ్యాయులకు, సృజనవాణి ధన్యవాదములు తెలుపుతూ...**

**మాతృ భాషను కాపాడుకుందాం - భావి తరాలకు అందిద్దాం**